# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బిజెపి సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పలు అంశాలపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు.**
2. **జూన్ 4న జరుగనున్న ఓట్ల లెక్కింపు సన్నద్ధత ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఈ రోజు జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **నిర్వహణ పనుల దృష్ట్యా విజయవాడ, గుంటూరు డివిజన్లలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు, మరికొన్ని రైళ్లను దారి మళ్లించిన్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.**
4. **ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రత్న బిరుదాంకితులు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి ఈ రోజు.**

==========================

దేశంలోని అనేక ప్రాంతాల్లో నెలకొన్న అధిక ఉష్ణోగ్రత పరిస్థితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. వడగాల్పుల కారణంగా మృతి చెందినవారి పట్ల సామాజిక మాధ్యమం వేదికగా ఆమె విచారం వ్యక్తం చేశారు. వివిధ స్థాయిలలోని పరిపాలన విభాగాలు వెంటనే స్పందించి వేడి పరిస్థితులకు గురయ్యే వారికి సహాయక చర్యలు తీసుకోవడం హర్షణీయమని రాష్ట్రపతి పేర్కొన్నారు.

------------------------

బిజెపి సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు పలు అంశాలపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో భాగంగా తొలుత ఈశాన్య రాష్ట్రాల్లో రెమాల్ తుపాను అనంతర పరిస్థితి, ఆయా రాష్ట్రాల్లో తీసుకుంటున్న సహాయక చర్యలపై సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత దేశంలో వడగాల్పుల పరిస్థితిని సమీక్షించేందుకు సమావేశం నిర్వహించనున్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లపై సమీక్షించేందుకు సంబంధిత అధికారులతో సమావేశం కానున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

------------------------

జూన్ 4వ తేదిన జరుగనున్న ఓట్ల లెక్కింపు సన్నద్ధత ఏర్పాట్లపై ఈ రోజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. వెలగపూడిలోని సచివాలయం నుండి దృశ్యమాధ్యమ విధానంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, ఈవీఎంల ఓట్ల

లెక్కింపుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, రౌండ్ల వారిగా ఫలితాల ప్రకటన, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు వంటి మొదలైన అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షిస్తున్నారు.

---------------------------

జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే ముందు రాజకీయ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు బ్రీత్ ఎనలైజర్ మద్యం పరీక్షలు నిర్వహిస్తామని పల్నాడు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మలిక గార్గ్ తెలిపారు. నరసరావుపేటలోని జేఎన్‌టీయూ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో పాజిటివ్ వచ్చిన వారినిమోట్ల లెక్కింపు కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టంచేశారు. పల్నాడు జిల్లాలో ఈరోజు నుండి 5వ తేదీ సాయంత్రం వరకు వ్యాపార సంస్థలను మూసివేయనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించామని తెలిపారు.

---------------------------

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 12న విద్యా సామాగ్రి పంపిణీ చేస్తామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. 1–10 తరగతుల విద్యార్థులకు పంపిణి చేసే విద్యా సామాగ్రిలో భాగంగా అన్ని పాఠ్యాంశాల పాఠ్యపుస్తకాలతో పాటు 3 జతల ఏకరూపదుస్తులు, బూట్లు, పాఠశాల బ్యాగు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువును అందజేస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆస్ట్రేలియాకు చెందిన మెల్బోర్న్ విశ్వవిద్యాలయం, రోటరీ భారత కెరీర్ విద్యాభివృద్ధి మండలి ఆధ్వర్యంలో పాఠశాలల్లో కెరీర్ విద్యా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ లను నియమించనున్నట్టు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ వివరాలను సమగ్ర శిక్ష వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు విజయవాడలో రెండు రోజులు శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని అన్ని తరగతుల నుంచి ఇద్దరు చొప్పున 50 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని వివరించారు.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ, గుంటూరు డివిజన్లలో నిర్వహణ పనులు జరుగుతున్న దృష్ట్యా ఆయా మార్గాల్లో నడిచే పలు రైళ్లను పూర్తిగా రద్దు చేయడంతో పాటు మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే విజయవాడ డివిజన్ పౌరసంబంధాల అధికారి నుస్రత్ మండ్రూప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు నుంచి జూలై 14 వరకు విజయవాడ – గుంటూరు, అలాగే ఈరోజు నుంచి జూన్ 30 వరకు రాజమండ్రి –విజయవాడ, జూలై 7 నుంచి 14 వరకు హుబ్లి– విజయవాడ రైళ్లు పూర్తిగా రద్దు చేశామని తెలిపారు. అదేవిధంగా ఈరోజు నుంచి జూలై 14 వరకు చెన్నై సెంట్రల్–విజయవాడ, చెన్నై సెంట్రల్–ఎస్వీడి కత్రా, చెన్నై సెంట్రల్– లక్నో రైళ్లను తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ జంక్షన్ల మీదుగా దారి మళ్లించి నడపనున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

స్వాతంత్ర్య సంగ్రామంలో చరిత్రలో నిలిచిపోయిన చీరాల–పేరాల ఉద్యమానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన వ్యక్తి ఆంధ్ర రత్న బిరుదాంకితులు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి ఈ రోజు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో 1889 జూన్ 2న జన్మించారు. స్కాట్లాండ్‌లో ఎంఎ చదువు పూర్తి చేసుకొని తిరిగి భారత్‌కు వచ్చిన గోపాల కృష్ణయ్య స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. నాటి బ్రిటిష్ ప్రభుత్వం చీరాల–పేరాల గ్రామాలను పురపాలక సంఘాలుగా చేసినప్పుడు పన్నుల భారం అధికం అవుతుందని ప్రజలను గ్రామాలు ఖాళీ చేయంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వమే దిగి వచ్చి మున్సిపాలిటీని రద్దు చేసింది. చీరాల–పేరాల ఉద్యమం కోసం రామదండు పేరిట స్వచ్ఛంద సేవాదళాన్ని ఏర్పాటు చేశారు. ఈ చీరాల–పేరాల ప్రజల ఉద్యమం స్వాతంత్ర్య పోరాటంలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. కాగా.. 1928 జూన్ 10వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని పురస్కరించుకుని తిరుపతిలోని బిజెపి కార్యాలయంలో ఈరోజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బిజెపి నేతలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జి. గోపీనాథ్ మాట్లాడుతూ, ఆంధ్ర దేశం అంతా తిరిగి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్య ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. తెలుగు నాట జానపద కళారూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాలకృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారని తెలిపారు.

---------------------------

దోమల వ్యాప్తిని అరికట్టడంతోనే మలేరియా నివారణ సాధ్యమని శ్రీకాకుళం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. ఈ రోజు నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా నిన్న అరసవల్లి స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

---------------------------

తెలంగాణ అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి దశాబ్దం పూర్తయిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గీతమైన జయ జయహే తెలంగాణ గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరుల ఆశయాలు సాధించిననాడే స్వరాష్ట్ర సాధనకు సార్థకత ఏర్పడుతుందని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ ఈ రోజు దర్శించుకున్నారు. ఈ ఉదయం కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా.... టిటిడి కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

---------------------------

శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపట్టాలని ఏలూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బి. కృష్ణ అన్నారు. ఏలూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్ లో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశంపై వివిధ అధికారులతో నిన్న అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జనపనార సంచులను పంపిణీ చేశారు.

======================